మెట్టపంటల సాగు లేనట్టే?

- ఆగస్టులోనూ అధికంగా ఉష్ణోగ్రతలు
- అల్పపీడంలోనూ అంతంతమాత్రంగా వర్షాలు
- ఎడగారు వరిసాగుపై రైతుల్లో గుబులు
- పతనమవుతున్న ధాన్యం ధరలు
- పెట్టుబడులు కూడా రావని ఆవేదన

పొదలకూరు: పైతట్టు ప్రాంతంలో వరదల వల్ల ప్రాజెక్ట్‌ల్లోకి నీరు వచ్చి చేరుతుంటే ఇక్కడ మాత్రం వర్షం కురవడం లేదు. ఈ ఏడాది రబీలో మెట్ట సేద్యం సాగేలా లేదని రైతులు అంటున్నారు. వర్షం స్వల్పంగా కురుస్తున్నా రైతులకు ఉపయోగకరంగా లేదు. సకాలంలో వానలు పడతాయని ఆశలు పెట్టుకున్నా ఆ ఊసే లేకపోవడంతో నేలలు పదునెక్కక దుక్కిదున్నకం పనుల జోలికి కూడా వెళ్లడం లేదు. ఈ ప్రాంతం రైతులు కొందరు వెంకటగిరి, నాయుడుపేట, శ్రీకాళహస్తి తదితర ప్రాంతాలకు వెళ్లి మినుము, పెసర పంటలను సాగు చేసేందుకు సమాయత్తమవుతున్నారు.

కానీ ఇలా..

సాధారణంగా ఈ సమయానికే మెట్ట పంటల సాగు చేసే రైతులు దుక్కి దున్నకం పనులను సిద్ధం చేసుకుని వర్షం కురిస్తే విత్తనాలు విత్తుతారు. సెప్టెంబర్ చివరి వరకు మినుము, పెసర, కంది, పచ్చిశనగ పంటలను సాగు చేయడం దశాబ్దాలుగా ఈ ప్రాంతంలో రైతులు అలవాటు పడ్డారు. అయితే వర్షాలు సకాలంలో కురవకపోవడం, అపరాల సాగులో వరుస నష్టాలను చవిచూస్తున్న అన్నదాతలు క్రమంగా సాగు విస్తీర్ణాన్ని తగ్గించుకుంటున్నారు. పొదలకూరు వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలో ఒకప్పుడు సుమారు 20 వేల ఎకరాల్లో అపరాల సాగు ఉండేది. నేడు 5 వేల ఎకరాల్లో సాగు చేసేందుకు కూడా ముందుకు రావడం లేదు.


మినుము సాగు (ఫైల్)

దీంతో పప్పుధాన్యాల సాగు తగ్గిపోయి ధరలు అమాంతం పెరుగుతున్నాయి.

ఎడగారు రైతుల్లో గుబులు

ఎడగారులో వరిసాగు చేస్తున్న రైతుల్లో గుబులు పట్టుకుంది. గతంలో వరిసాగు ఎకరాకు రూ.15 వేల నుంచి రూ.20 వేల పెట్టుబడులయ్యేవి. ఇప్పుడు ఆ మొత్తం రూ.30 వేలకు చేరింది. ఎరువులు, పురుగు మందుల ధరలు అమాంతం పెరిగిపోవడంతో రైతులు వ్యవసాయం చేసేందుకు భయపడాల్సి వస్తోంది. దీనికితోడు పండించిన పంటకు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ధాన్యాన్ని అమ్ముకోవాలంటే ప్రహసనంగా మారడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొదలకూరు వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలో ఉన్న పొదలకూరు, మనుబోలు, రాపూరు, చేజర్ల, కలువాయి మండలాల్లో ఎడగారులో 12 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. ప్రస్తుతం బయటి ప్రాంతాల్లో ఎడగారులో పండించిన ఒక పుట్టి ధాన్యం రూ.13 వేలు మాత్రమే ధర పలుకుతోంది. ఈ సమాచారం తెలుసుకున్న రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ధరలు పెరగకుంటే పెట్టిన పెట్టుబడులు కూడా రావని వాపోతున్నారు. సాధారణంగా ఎడగారులో వరి ధాన్యం దిగుబడి తగ్గుతుంది. రబీలో ఎకరాకు 4 పుట్ల ధాన్యం దిగుబడి అయితే ఎడగారులో 3 పుట్లు దిగుబడి అవుతుంది. దీంతో ధరలు లేకపోతే రైతులు బాగా నష్టపోవాల్సి వస్తుంది.


మండలంలో ఎడగారులో వరిసాగు

బయట జిల్లాలకు వెళతాం



మినుము, పెసర సాగు చేసేందుకు బయటి జిల్లాకు వెళతాం. నాయుడుపేట, శ్రీకాళహస్తిలో వర్షాలు సకాలంలో కురవడంతోపాటు అక్కడి నేలలు అపరాల సాగుకు అనుకూలంగా ఉంటాయి. అకాల వర్షాలు కురిసినా పెద్ద స్థాయిలో నష్టం వాటిల్లదు.

– వై.వెంకటేశ్వర్లురెడ్డి, రైతు, మొగళ్లూరు

ధాన్యం ధరలు పెరగాలి



ఎడగారులో సాగు చేస్తున్న వరి ధాన్యం ధరలు పెరగాలి. ఇప్పుడున్న ధరలే ఉంటే రైతులు చాలా నష్టపోవాల్సి వస్తుంది. రైతులను ఆదుకోవాలంటే గిట్టుబాటు ధరలు కల్పించాలి. లేదంటే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. పంటలు పండిస్తున్నా గిట్టుబాటు ధరలు ఉండడం లేదు.

– పి.లచ్చారెడ్డి, రైతు, తాటిపర్తి

క్లుప్తంగా

వామ్మో.. పాము



పొదలకూరు: పట్టణంలోని శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానం కార్యాలయం గదిలోకి ఆదివారం పాము (జెర్రిపోతు) వచ్చింది. భక్తులు భయపడటంతో పాపిశెట్టి విష్ణు అనే యువకుడు ధైర్యం చేసి పామును పట్టి ప్లాస్టిక్ సంచిలో బంధించి దూరంగా వదిలేశాడు. దగ్గరలో ప్లాట్లు కాలువ, ముళ్లచెట్లు ఉండటంతో తరచూ ఆ ప్రాంతంలో పాములు తిరుగుతున్నాయి.

సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తాం


మాట్లాడుతున్న రఘు, సుదర్శన్

ఇందుకూరుపేట: మండలంలోని గంగపట్నం దళితవాడ ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తామని జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ మాజీ సభ్యుడు కొప్పోలు రఘు, జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు శేషం సుదర్శన్ అన్నారు. గంగపట్నంలో ఆదివారం వారు పర్యటించి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్రెయినేజీ, శ్మశానం వంటి సమస్యలు మా దృష్టికి వచ్చాయని, అలాగే స్థానికంగా ఓ వ్యక్తి పేదల స్థలాలను ఆక్రమిస్తూ పెద్ద ఎత్తున గోడ కట్టారన్నారు. దీనిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

గణేష్ ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి

విడవలూరు: మండల పరిధిలో జరిగే గణేష్ ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి అని ఎస్సై పి.నరేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్వాహకులు ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చూసుకోవాలన్నారు. డీజే సౌండ్ బాక్సులు వాడరాదన్నారు. పండగను జాగ్రత్తగా జరుపుకోవాలని కోరారు.

జీవిత ఖైదీ మృతి

తిరుపతి క్రైం: అనారోగ్యంతో జీవిత ఖైదీ మృతిచెందిన ఘటన ఆదివారం స్విమ్స్ ఆస్పత్రిలో చోటు చేసుకుంది. వెస్ట్ సీఐ మురళీమోహన్ కథనం.. నెల్లూరు జిల్లాలోని మైపాడుకు చెందిన షేక్.కాలేషా (64) ఓ వ్యక్తిని హత్య చేసి నెల్లూరు సెంట్రల్ జైల్లో జీవిత ఖైదు అనుభవిస్తున్నాడు. అయితే కొద్దిరోజులుగా అనారోగ్యంగా ఉండటంతో నెల్లూరు జైలు పోలీసులు సిమ్స్ హాస్పిటల్‌కు తీసుకొచ్చారు. ఇక్కడ చికిత్స పొందుతూ కాలేషా మృతిచెందాడు.

సూట్‌కేసును గుర్తించి.. అప్పగించి..


సూట్‌కేసును అప్పగిస్తున్న కానిస్టేబుల్

నెల్లూరు(క్రైమ్): ఆటోలో మరిచిపోయిన సూట్‌కేస్‌ను సాంకేతికత ఆధారంగా పోలీసులు గుర్తించి బాధితులకు అందజేశారు. సేకరించిన సమాచారం మేరకు.. ఎర్రన మహేందర్‌రెడ్డి, ప్రశాంతి అన్నా చెల్లెలు. వారు తమ స్వగ్రామం బిట్రగుంటకు వెళ్లేందుకు బెంగళూరు నుంచి ఆర్టీసీ బస్సులో ఆదివారం నెల్లూరుకు చేరుకున్నారు. ప్రధాన బస్టాండులో బస్సు దిగి ఆటోలో ఆత్మకూరు బస్టాండుకు వెళ్లారు. అక్కడి నుంచి బస్సులో బిట్రగుంటకు వెళ్లారు. ఇంటికి వెళ్లి లగేజీని చూసుకోగా సూట్‌కేస్ కనిపించలేదు. దీంతో నెల్లూరు చిల్డ్రన్స్‌పార్కు వద్ద ఉంటున్న బంధువు మాల్యాద్రిరెడ్డికి జరిగిన విషయాన్ని చెప్పి అందులో రూ.20 వేల నగదు, విలువైన వస్తువులున్నాయని తెలిపారు. ఆయన నార్త్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణకు విషయాన్ని తెలియజేశారు. ఇన్‌స్పెక్టర్ ఆత్మకూరు బస్టాండు వద్ద విధుల్లో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్ పొన్నుస్వామిని అప్రమత్తం చేశారు. ఆయన ఆత్మకూరు బస్టాండు పరిసర ప్రాంతాల్లో ఆటో కోసం గాలించారు. అనంతరం కమాండ్ కంట్రోల్ సిబ్బంది సాయంతో ఆటోను గుర్తించారు. ఆటో డ్రైవర్ వద్ద నుంచి సూట్‌కేసును స్వాధీనం చేసుకుని బాధితులకు అప్పగించారు.

డయల్ యువర్ డీఎం-1 నేడు

నెల్లూరు సిటీ: డయల్ యువర్ డీఎం-1 కార్యక్రమాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు డీఎం-1 ఇన్‌చార్జి మేనేజర్ ఎం.సునీత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి 12 గంటల మధ్య 99592 25641 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు. ప్రయాణికులు తమ సమస్యలు, సూచనలు ఇవ్వాలన్నారు.

డేంజర్ మలుపులు


అనంతపురం సమీపంలో ఇలా..

తోటపల్లిగూడూరు: మండలంలోని ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదార్ల వెంబడి పలు ప్రాంతాల్లో ఉన్న మలుపులు ప్రమాదాలకు నిలయంగా ఉన్నాయి. నరుకూరు నుంచి కోడూరు వరకు, కాకుపల్లి సెంటర్ నుంచి వరకవిపూడి వరకు ఆర్‌అండ్‌బీ రోడ్లున్నాయి. వీటిలో సుమారు 50కి పైగా మలుపులున్నాయి. కాగా అధిక శాతం వద్ద వేగ నియంత్రణకు సంబంధించి ఎలాంటి హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. కొన్ని మలుపులు మృత్యు శకటాలుగా మారుతున్నాయి. ముఖ్యంగా వరిగొండ దేవళాలమిట్ట సమీపంలో ఉన్న రెండు మలుపులు అతి ప్రమాదకరంగా ఉన్నాయి. అనంతపురం, మాచర్లవారిపాళెం, పేడూరు, కోడూరు, సౌత్‌ఆములూరు, చిన్నచెరుకూరు గ్రామాల సమీపాల్లో ఇదే పరిస్థితి ఉంది. అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.


మాచర్లవారిపాళెం సమీపంలోని మలుపు

వైభవంగా వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు


ఆరాధనోత్సవాలకు హాజరైన భక్తులు



మనుబోలు: ప్రత్యేకాలంకరణలో వెంకయ్యస్వామి

వెంకటాచలం: వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా చివరిరోజైన ఆదివారం వేకువజామునే స్వామిని కాకడ హారతితో మేల్కొల్పారు. అనంతరం పాలు, గంధం, విభూతి, పంచామృతాలతో అభిషేకాలు చేశారు. విశేష పుష్పాలతో స్వామిని అలంకరించారు. ఆశ్రమంలో ప్రత్యేక పూజలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. ఉదయం భక్తుల రాక కాస్త తగ్గినా, సాయంత్రానికి క్రమంగా పెరిగింది. దీంతో ఆశ్రమ ప్రాంగణం కిటకిటలాడింది. ఆశ్రమ నిత్యన్నదాన శాలలో నిడిగుంటపాళెం గ్రామానికి చెందిన రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. అలాగే గొలగమూడి గ్రామస్తుల ఆధ్వర్యంలో నెల్లూరు వైపు వెళ్లే మార్గంలో వేలాది మందికి, ఆశ్రమానికి నలువైపులా వెంకయ్యస్వామి భక్తులు అన్నదాన కార్యక్రమాలు జరిగాయి.

- **మనుబోలు:** మండలంలోని మనుబోలు బీసీ కాలనీ సమీపంలో వెంకయ్యస్వామి ఆధాధనోత్సవాలు ఆదివారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలు, విద్యుద్దీపాలతో అందంగా ముస్తాబు చేశారు. అర్చకులు శ్రీనివాసులు ఉదయం వివిధ పూజలు చేశారు. నదీజలాలతో శిఖరానికి అభిషేకం నిర్వహించారు. ఆలయం బయట హోమగుండం వేసి శాస్త్రోక్తంగా ధుని పూజ చేశారు. కల్యాణం, సంతానం కోసం భక్తులు నవధాన్యాలను హోమగుండంలో వేసి వ్రతాలు ఆచరించారు. ఉభయకర్తలుగా ముంగర విజయభాస్కర్‌రెడ్డి – విజయమ్మ దంపతులు వ్యవహరించారు. అన్నదానం చేశారు. రాత్రి పల్లకి సేవతో ఉత్సవాలు ముగిశాయి.

బొజ్జ గణపయ్యలు సిద్ధం


సిద్ధం చేసిన విగ్రహాలు


తుది మెరుగులు దిద్దుతూ..

- నరుకూరు కేంద్రంగా తయారీ
- అమాంతంగా పెరిగిన విగ్రహాల ధరలు

తోటపల్లిగూడూరు: పల్లెల్లో వినాయకచవితి సందడి నెలకొంది. ఈనెల 27వ తేదీన పండగ నేపథ్యంలో ఊరూరా సంబరాలు జరుపుకొనేందుకు ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. బొజ్జ గణపయ్య విగ్రహాలకు డిమాండ్ పెరిగింది. నరుకూరు సెంటర్‌లో ప్రస్తుతం మూడు తయారీ కేంద్రాలున్నాయి. వీటి ద్వారా ఈ ఏడాది సుమారు 450కు పైగా విగ్రహాలు రూపుదిద్దుకున్నాయి. రెండడుగుల నుంచి 15 అడుగుల ఎత్తైనవి తయారు చేశారు. ఉత్సవాల నిర్వాహకులు కొద్దిరోజుల క్రితమే ఆర్డర్లు పెట్టారు. దీంతో తయారీదారులు విభిన్న రీతిలో, రంగురంగుల విగ్రహాలను రూపొందించారు. కాగా విగ్రహాల తయారీకి సంబంధించి ముడిసరుకుల ధరలు అమాంతం పెరిగిపోయాయి. ఈ నేపథ్యంలో గతంలో రూ.2 వేలు పలికిన రెండు అడుగుల బొమ్మ నేడు రూ.3 వేలకు చేరింది. ఒకప్పుడు రూ.6 వేలకు లభ్యమైన 6 అడుగుల బొమ్మ నేడు రూ.9 వేలకు చేరింది. రూ.11 వేల విలువైన 8 అడుగుల బొమ్మ ధర ఇప్పుడు రూ.12 వేల నుంచి రూ.14 వేల వరకు ఉంది.

డిమాండ్ పెరిగింది

ముడిసరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. దీంతో తయారీ, కూలీల ఖర్చులు అధికమయ్యాయి. ఈ కారణంతోనే బొమ్మల ధరలను కాస్త పెంచక తప్పడం లేదు. ఉత్సవాల నిర్వాహకుల అర్థం చేసుకుని కొనుగోలు చేస్తుండటం ఆనందంగా ఉంది.

– విజయ్‌కుమార్, విగ్రహాల తయారీదారుడు, నరుకూరు

బీసీలంతా ఐక్యంగా ఉండాలి


సమావేశంలో పాల్గొన్న బీసీ నాయకులు

మనుబోలు: బీసీలందరూ ఐక్యంగా ఉంటూ సమస్యలపై పోరాటం చేయాలని బీసీ ఐక్య వేదిక తీర్మానించింది. మనుబోలు కోదండరామపురంలోని శ్రీపద్మావతి కల్యాణ మండపంలో వేదిక సమావేశం ఆదివారం జరిగింది. సావిత్రి బాయి పూలే, జ్యోతిరావు పూలే విగ్రహాలను మనుబోలు మండల కేంద్రంలో ఏర్పాటు చేయాలని తీర్మానించారు. త్వరలో మండల స్థాయి సమావేశం ఏర్పాటు చేసి బీసీ హక్కుల పోరాటంపై కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తామని తెలిపారు. సమావేశంలో నాయకులు ఆశం సురేష్, పాశం నాగరాజు, కన్నా సుబ్బయ్య, పెనుబాక మహేష్, శివుడు రాజాగౌడ్, బండికట్టు రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ మండల కమిటీ ఎన్నిక



మాట్లాడుతున్న సీఐటీయూ నేతలు

కోవూరు: స్థానిక సీతాపోలయ్య భవనంలో సీఐటీయూ మండల కమిటీ ఎన్నిక ఆదివారం జరిగింది. అధ్యక్షుడిగా వి.సుబ్రహ్మణ్యం, కార్యదర్శిగా పి.హరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు టీవీ ప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో గండవరపు శేషయ్య, అల్లాడి గోపాల్, ఏలూరు సుజాతమ్మ, అఫ్రోజ్, ఖాజావలీ, చెన్నయ్య, చెంచురామిరెడ్డి, ఫాతిమా, పాపయ్య, విజయ్‌కుమార్, చాంద్‌బాషా, యస్దాని తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా జగన్నాథ రథయాత్ర


రథాన్ని లాగుతున్న భక్తులు

ఇందుకూరుపేట: మండలంలోని మైపాడులో ఇస్కాన్ ఆధ్వర్యంలో పూరి జగన్నాథ రథయాత్ర ఆదివారం కనులపండువగా జరిగింది. తొలుత శ్రీకృష్ణ బలరాములను ప్రత్యేకంగా అలంకరించి రథంపై కొలువుదీర్చారు. స్థానిక కృష్ణ మందిరం నుంచి రథయాత్ర ప్రారంభమై మేళతాళాలు, కోలాటాల నడుమ గ్రామవీధుల్లో ఊరేగించారు. భక్తులు హరేరామ హరేకృష్ణ అంటూ రథాన్ని లాగేందుకు పోటీ పడ్డారు. పండ్లు, కొబ్బరికాయ కర్పూర హారతులు పట్టి స్వామివారిని దర్శించి తన్మయం చెందారు. నెల్లూరు ఇస్కాన్ అధ్యక్షుడు సుఖదేవస్వామి పర్యవేక్షణలో రథయాత్ర జరిగింది. కమిటీ సభ్యులు డీవీఎస్ గిరి, బాబు, శ్రీనివాసులు, బాలకృష్ణ, సుధీర్, గిరి, చందు తదితరులు పాల్గొన్నారు.


రథంలో కొలువుదీరిన స్వామివారు

శివాలయ పాలకమండలి ప్రమాణ స్వీకారం నేడు

ఇందుకూరుపేట: మండలంలోని మైపాడులో శివాలయం పాలకమండలి ప్రమాణ స్వీకారం ఆలయ ఆవరణలో సోమవారం జరగనుందని కార్యనిర్వాహణాధికారి తాతా శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. పాలకమండలి సభ్యులతో పాటు భక్తులు హాజరు కావాలని కోరారు.

నిషేధమున్నా.. ఆగని వేట

కనిగిరి రిజర్వాయర్ పరిధిలో చేపల వేట యథేచ్ఛగా సాగుతోంది. దీని పరిధిలో వేట నిషేధం కొనసాగుతున్నా ఇతర మండలాలకు చెందిన కొందరు అక్రమంగా చేపలు పడుతూ స్థానికుల పొట్ట కొడుతున్నారు.

- కనిగిరి రిజర్వాయర్‌లో యథేచ్ఛగా చేపల వేట
- పట్టించుకోని అధికారులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: జిల్లాలో సంగం, బుచ్చిరెడ్డిపాళెం, దగదర్తి మండలాలకు తాగు, సాగునీటికి ఆధారం కనిగిరి రిజర్వాయర్. బ్రిటిష్ హయాంలో దీనిని నిర్మించారు. సుమారు 1800 హెక్టార్లలో విస్తరించి ఉంది. సోమశిల జలాశయం నుంచి కనిగిరి రిజర్వాయర్‌కు నీరు చేరుతుంది. దాదాపు మూడు టీఎంసీల నీరు నిల్వ చేసే సామర్థ్యం ఉంది. ఇంత ప్రాముఖ్యత కలిగిన రిజర్వాయర్ ఓ పక్క ఆక్రమణలకు గురవుతుంటే మరో పక్క వేట నిషేధించిన సమయాల్లో కూడా ఇతర మండలాల నుంచి వచ్చిన కొందరు అక్రమంగా రిజర్వాయర్‌లో చేపలవేట సాగిస్తున్నారు. ప్రతి సంవత్సరం జూలై, ఆగస్టు మాసాల్లో చేపలు గుడ్లు పెట్టే సమయం. అందువల్ల ఈ రెండు మాసాలు అధికారులు మత్స్యకారులకు చేపలవేట సాగించవద్దని నిషేధం విధిస్తారు. అయితే ఇవేవీ పట్టించుకోని కొందరు అక్రమార్కులు నిషేధిత వలలు వాడుతూ యథేచ్ఛగా వేట సాగిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు.


రిజర్వాయర్‌లో చేపల వేట సాగిస్తున్న మత్స్యకారులు

సొసైటీ వాదన మరోలా..

కనిగిరి రిజర్వాయర్‌కు సంబంధించి 371 మంది సభ్యులతో మత్స్యకార సహకార సొసైటీ ఏర్పాటై ఉంది. ఏటా వేలంపాట ద్వారా నగదు చెల్లించి చేపలు పట్టుకునే హక్కు పొందుతారు. అయితే గత మూడు సంవత్సరాల నుంచి మత్స్యశాఖ అధికారులు చేప పిల్లలు వదల్లేదని వారు అంటున్నారు. ఏటా చేపపిల్లలు వదిలితే మత్స్య సంపద వృద్ధి చెందుతుందని, మూడేళ్ల నుంచి చేపపిల్లలు వదలకుండా వేట నిర్వహించేందుకు అధికారులు పూనుకోవడం సరికాదని వాపోతున్నారు. చేప పిల్లలు వదలకుండా వేలపాటలు నిర్వహిస్తే ఏంలాభం. పాట పాడుకున్న వారికి నష్టాలు తప్ప ఆదాయం ఉండదు. అలాగే తమకు జీవనాధారం చేపల వేటేనని, వేట నిషేధ సమయంలో తమను ప్రభుత్వం ఆదుకునే చర్యలు తీసుకోవాలని స్థానిక మత్స్యకారులు అంటున్నారు. ఇదిలా ఉంటే ఇతర మండలాల నుంచి రాత్రుళ్లు కొందరు అక్రమంగా వేట సాగిస్తున్నారని, ఇలాంటివారిపై మత్స్యశాఖ, పోలీసు అధికారులు నిఘా ఉంచి కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సెప్టెంబర్‌లో చేపపిల్లలు వదులుతాం

గత మూడు సంవత్సరాలుగా అనేక కారణాల వల్ల చేప పిల్లలు వదల్లేదు. మత్స్యకార సహకార సంఘ సభ్యుల నుంచి కూడా కొంత నగదు రావాల్సి ఉంది. ఈ నెలాఖరు వరకు వేట నిషేధం ఉంది. దీనిపై పోలీసుశాఖతో చర్చించి నిఘా ఉంచుతాం. సొసైటీ సభ్యులు బకాయిలు చెల్లించిన వెంటనే చేపపిల్లలు వదిలి మత్స్య సంపదకు కృషి చేస్తాం.

– పొట్టియ్య, మత్స్యశాఖ అధికారి


కనిగిరి రిజర్వాయర్